**కథ** — **-వీరాజీ**

# సూర్యారావూ-స్వయంపాకమూ

**ఇది నళిని అనే పెళ్ళీడు వచ్చిన అందమైన ఆడపిల్ల కథ. నళిని గురించి చెప్పేముందు వంట గురించి చెప్పాలి. ఎందుకంటే వంట చెయ్యాలన్నా, కథ చెప్పాలన్నా ఉప్పుతో తొమ్మిదీ, పప్పుతో పదీ చూసుకోవాలి కదా! కానీ యిదే మిటి? అని కథానాయిక నళినిని నిలదీశారనుకోండి. ఆ పిల్ల చెప్పలేదు. ఎందుకంటే వారపత్రికలో పడే వంటా వార్పూ కుట్లు అల్లికలు శీర్షికల్ని నళిని ఖాతరు చెయ్యదు. సీరియల్ కథలు మాత్రం సీరియస్‌గా చదివి, సినిమా బొమ్మలు చూసి పత్రికల్ని అవతల పడేస్తుంది.**

సూర్యారావు మొదట్నుంచీ చురుకైనవాడు. వాళ్లమ్మ వెనక అదీ యిదీ సాయం చేస్తూ చిన్నప్పుడే వంట నేర్చుకున్నాడు. మరీ ఏడో ఏటా మూడో క్లాసూ, పదో ఏట ఏడో క్లాసూ చదువుకున్నాడు. ప్రస్తుతం పెద్దవాడై పట్టభద్రుడై ఆ డిగ్రీ కాయితాన్ని భద్రంగా పటం కట్టి గోడకి వ్రేలాడగట్టాడు.

అలాగే మొన్నామధ్య వాళ్ళమ్మా, నాన్నగారు కూడబలుక్కుని తిరుపతిలో అని చెప్పి సలక్షణంగా తిరుచానూరులో ఉపనయనం చేసి మూడు పోగుల జందెం వేసి దీవిస్తే ''అత్తెర్రీ! యిరవై రెండు సంవత్సరాల, ఎనిమిది మాసాల తొమ్మిది రోజుల పెళ్ళీడు వాడికి మూడు పోగుల జందెం వేస్తారా? ఏడు పోగులయినా వుండాలి!'' అంటూ బాధపడ్డాడట! అంటే పెళ్ళికీ, ఉద్యోగానికీ కూడా సూర్యారావుకి అర్హత వచ్చేసిందన్నమాట!

సూర్యారావు డిగ్రీకి కాపీ తీసి పోస్టులో పంపగానే ఆడపిల్లలెక్కువగా వున్న తండ్రి బ్రహ్మచారిని చూడగానే..పిల్లనిస్తానని వచ్చినట్లు ఓ కంపెనీవాళ్ళు అర్జెంటుగా తిరుగుటపాలో ఉద్యోగం యిచ్చేశారు! ఇందులోగల అసలు రహస్యం వాళ్ళ నాన్నకి తప్ప రెండో కంటికి, ఆ ఇంట్లో వాళ్ళకి తెలియదు.

సూర్యారావుకు ఎగిరి గంతేసినంత సంతోషం వేసి ఎగిరి గంతేశాడు కూడా. కానీ ఏం చేస్తాం? అంతెగిరినా ఆఖరికి నట్టింటి గుమ్మం కూడా నెత్తికి తగల్లేదే! ఇలాంటి పసివాణ్ణి పట్నం ఉద్యోగానికెలా పంపనూ? అని వాపోయింది వాళ్ళ అమ్మ. కానీ వాళ్ళ నాన్నగారు మాత్రం ఈ విషయంలో కాస్త కోప్పడ్డాడు. ''ఆ యీడుకి నేనూ, నువ్వూ వాణ్ణి ఎత్తుకుని ఆడించాం. పైగా ఎన్నాళ్ళేం? ఒంటిరెక్క బ్రతుకు! వేణ్ణీళ్ళకు చన్నీళ్ళు అని నాకు నాలుగు రాళ్ళూ వస్తాయి. వాడికి కాస్త లోకానుభవం రావాలి'' అంటూ సూర్యారావుని రైలెక్కించి ఉద్యోగానికి పంపించేశాడు.

వాళ్ళమ్మ ప్రేమగా ఒక అరబస్తా పాత బియ్యం, ఒక పది నెయ్యి ప్యాకెట్లు..ఒక బుట్ట నిండా నీరుల్లిపాయలు (వెల్లుల్లిపాయలంటే సూర్యారావుకి పరమ అసహ్యం) ఒక జాడీలో పాత గూనల్లోంచి ప్రత్యేకంగా తీసిన ఊట ఆవకాయ... ఇంకా కాసిన్ని మినపసున్ని ఉండలు ఇచ్చింది.

పట్నంలో సూర్యారావు 'కథానాయకుడులా' దిగాడు. అతనితోపాటూ ఆవకాయ, ఆవునెయ్యి దిగాయి. అలా దిగిన సూర్యారావు కథ అలా ఉండనిద్దాం! నళిని సంగతి చూద్దాం...

నళినికి వాళ్ళ బామ్మ అంటే కోపం. బామ్మకి నళిని అంటే యిష్టం. ముఖ్యంగా నళిని ఒక్క జడ మాత్రం వేసుకోవడం ఆవిడకి మరీ యిష్టం. 'సవరం పెట్టుకుని ఎంచక్కా పొడుగ్గా బారెడు జడ అల్లుకోవే అమ్మా' అంటుందావిడ. పొట్టిగా, ఒత్తుగా పెరిగిన కేశసంపద కలిగిన మనుమరాలికి మాత్రం రెండు జడలు- అదీ తన నిజం జుట్టుతోనే వేసుకోవడం యిష్టం! కొసలు వెడల్పుగా అట్లకాడల్లా ఉండాలి. అదీ ఫ్యాషన్! నళినికి పాటలు వినడం యిష్టం!

కానీ బామ్మకి నళినిని పాట పాడమనడం, పాట నేర్చుకోమని వేధించడం వచ్చును. నళినికి డిగ్రీలో ఒక పార్టు ఉండిపోయింది. అంచేత ఈ ఏడాది ఆ అమ్మాయి ఇంట్లోనే ఉండిపోయింది. నళినికి ఒక అన్నయ్య ఉన్నాడు. చదువుకుందికి హైదరాబాద్ వెళ్ళిపోయాడు. ఒక గది అతనికి ఆ ఇంట్లో కేటాయింపుగా అంటే..విడిగా ఉండేది. ఆ గది యిప్పుడు ఖాళీగా ఉంది. నళిని వాళ్ళ నాన్నగారు ఆ గది అద్దెకిద్దామా అని గట్టిగానే అనుకుంటున్నాడీ మధ్యన.

సూర్యారావు ఉద్యోగం యిచ్చిన కంపెనీలోనే ఒక గురవయ్యగారున్నారు. అతనికి నళిని తండ్రి మనసులోని ఉద్దేశం బాగా తెలుసును. ఎందుకంటే ఆ యిద్దరూ చతుర్ముఖ పారాయణం ఫ్రెండ్సూ! గురువయ్య రికమండేషన్..సూర్యారావు అదృష్టమూ రెండూ మంచివి అవడం మూలానా అతని సిఫార్సు మీద నళిని వాళ్ళ ఇంట్లో ఖాళీగా వున్న మెట్ల మీద గదిలో సూర్యారావు అద్దెకు దిగిపోగలిగాడు.

సూర్యారావుతోపాటు ఆవకాయ, ఆవునెయ్యీ కూడా ప్రవేశించాయి.

నళిని సూర్యారావుని చూడలేదని సూర్యారావు అనుకున్నాడుగానీ నళిని సూర్యారావునీ, సూర్యారావు సామానులో ఉన్న ఆవకాయ రుచితో సహా చూడగలిగిందనీ వాళ్ళ బామ్మకి మాత్రమే తెలుసు!

ఓసారి ఆవిడ నళిని కేసి చూసి ''రెండు జడలు వేసుకుంటేనేగానీ నీకు మొగుడు రాడని బెంగటే?'' అని అడిగింది.

నళిని మొహం ముడుచుకుని ''అలా అయితే అసలు నాకు పెళ్ళే అక్కరలేదు పో'' అంది.

'అవ్వ' అంది వాళ్ళ బామ్మ నోరు నొక్కుకుని.

నళిని రెండు జడలలో ఇంత విప్లవగాధ ఉందని తెలియని సూర్యారావు బుద్ధిగా ఆఫీసుకు, అక్కణ్ణించి కాఫీ హోటల్‌కు ఆ తర్వాత తిన్నగా భోజనం మెస్‌కు కూడా వెళ్లి రెండు రోజులు ఎలాగో...ఏదో తిని నేరుగా రూమ్‌కి వచ్చేవాడు. మూడో రోజున ఉదయం తొమ్మిదిన్నర గంటలకి నళిని కూనిరాగాలు తీస్తూ వాళ్ళ దొడ్లో బాత్‌రూమ్‌లో వెణ్ణీళ్ళతో స్నానం చేస్తోంది. వాళ్ల బామ్మ రోట్లో పచ్చడి రుబ్బుతోంది. అదే సమయానికి అద్దంలో చూసుకుని ఆరోసారి క్రాఫింగ్ దువ్వుకుంటున్న సూర్యారావుకి టక్కున ఓ సంగతి జ్ఞాపకం

వచ్చింది.

వెంటనే హోల్డాలు పక్కనే వున్న సజ్జకేసి భయంగా చూశాడు. ఉల్లికాడలు తొంగిచూశాయి. ప్రక్కనే ఉన్న జాడీ మూత ఎత్తాడు. ఆవకాయ ఎర్రగా ఉంది. నోరూరింది పాపం సూర్యారావుకి. సీసాలో నెయ్యి బూజు పడుతోంది. ఆవకాయని ఒక గ్లాసులోకి తీసుకుని కాస్త హోటలుకు పట్టుకెళ్తే ఎలా వుంటుందీ...అనే ఆలోచన వచ్చింది! సూర్యారావుకి ఆలోచనలు మెరుపుల్లా వస్తాయికానీ పిడుగుల్లాంటి అనుమానాలు కూడా వాటిని తరుముతాయి.

'నళిని చూస్తుందో ఏమో?' అని భయం వేసింది. 'వీడెవర్రా...బాబూ! ఆవకాయ, ఆవునెయ్యి, ఉల్లిపాయా అన్నీ తీసుకుని హోటలుకి పోతున్నాడు' అనుకుంటుందేమో ఆ పిల్ల అనుకున్నాడు సూర్యారావు- వంట రాక పోతే అంతేనని కూడా అనుకుంటుందేమో!


కానీ ఆ సమయంలో సూర్యారావుకి తర్కమే అసలు తలకెక్కలేదు. ఏమైనా నళిని, రెండు జెడలు వేసుకునే నళిని, హిందీ సినిమా పాటలు రాగాలు తీసే నళిని చూస్తూ ఉండగా, ఆవకాయ కాదు కదా, ఒక్క నీరుల్లిపాయ జేబులో వేసుకుని కూడా మేడమెట్లు దిగలేను అని ఒప్పేసుకున్నాడు సూర్యారావు- అద్దంలో తనకెప్పుడూ అందంగా అగుపించే తన ప్రతిబింబం ఎదుట నిలబడి-

ఆ విధంగా సూర్యారావు ఆవకాయనూ, ఆవు నెయ్యినీ, కందిపొడినీ, కొరివికారాన్నీ అన్నింటినీ రూమ్‌లోనే భద్రంగా వదిలి దీనంగా మెట్లు దిగుతుండగా స్నానం పూర్తి చేసుకుని పరికిణీ, వోణీ వేసుకుని అలా పెరట్లోంచి వస్తూ యిలా ఇంట్లోకి పారిపోతున్న నళిని ఓ చూపు చూసింది. దాంతో సూర్యారావు దీనవదనం చెంపదెబ్బ కొట్టినట్లు అదిరిపోయాడు! ఆగిపోయాడు అలా...

ఇంకా నయం ఆవకాయ లేదు చేతిలో అనుకున్నాడు. దిగి నేరుగా భోజనం మాట మరిచిపోయి ఆఫీసుకి వెళ్ళిపోయాడు.

అలా నాలుగు రోజులు ఉత్త చేతులతో వెళ్ళి హోటలులో తిండి, ఆఫీసులో పని చేతకాక చీవాట్లు తినేసరికి సూర్యారావుకి నాలికమీద గెడ్డం మీద కూడా వెంట్రుకలు మొలిచాయి..అనిపించింది!

'అబ్బ నాకీ రిఫైన్డ్ ఆయిల్ పడదు నాకీ హోటల్ చెట్నీ కిట్టదు' అనుకున్నాడు. కానీ ఏం చేస్తాం? రూమ్‌లో అన్నీ ఉండి ఏమీ లేనివాడయ్యాడు సూర్యారావు. నీరుల్లిపాయల సజ్జలో ఎలుకళ్ళు వచ్చి కాపురం పెడుతున్నాయి గనుక సజ్జతో సహా ఎవరూ చూడకుండా కిటికీలో నుంచి రోడ్డు మీదకు అవతల పారేశాడు. విధి బలీయం కదా! చూస్తూ చూస్తూ కాస్త వేలితో తీసి నాకిన తర్వాత కూడా ఆవకాయనూ, ఆవు నెయ్యినీ ఎలా పారేయడం? కానీ సూర్యారావు చురుకైనవాడనీ, పట్టభద్రుడనీ




ముందే చెప్పాను కదా! ధైర్యం కోసం వాళ్ళమ్మ రాసిన ఉత్తరం చదువుకున్నాడు మరోసారి.

''బాబూ ఆశీస్సులు. ఎలా వున్నావో..యేమో? నీవు ఆ దంపుడు బియ్యం కాకపోతే మానే, కాసిన్ని ఓ పావు మూట మర బియ్యమైనా నీతో పట్టుకుపో లేదు!'' అంటూ ఆమె బాధపడుతూ రాసింది.

ఆ వేళ ఆఫీసులో సూర్యారావుకి పని తోచ లేదు. వంట చేసుకోవాలనే ఆలోచన బుర్రలోకి ప్రవేశించింది. నళిని కూడా గుర్తుకి రాలేదు. ఎంతసేపూ భోజనం..ముఖ్యంగా వేడి వేడి అన్నం, నెయ్యి, కందిపొడుం, ఆవకాయలాంటి తెలుగు మాటలన్నీ బుర్ర దొలిచేస్తున్నాయి. అవి తలలోంచి చేతిమీదుగా కలంలోకి దూరి కాయితం మీదకి నల్లగా జారిపోతున్నాయేమోనన్న భయంతో ఎట్టకేలకు సూర్యారావు ఒక నిర్ణయం చేసుకున్నాడు. 'నేను వండుకుంటాను' అనుకున్నాడు.

''ఏం కావాలి వండుకోడానికి?'' మొదటిది వంట రావాలి. అది సూర్యారావుకు రాదని ఏ చరిత్రకారులేనా రాస్తే వాళ్ళని గుండేసి కొట్టినా పాపం లేదు. సూర్యారావు భీముడు కాకపోయినా నలుడు కాగలుడు.

తిన్నగా మేనేజర్ దగ్గరకెళ్ళి ''సార్ ఐవాంట్ లీవ్!'' అన్నాడు.



''ఎందుకూ?'' అన్నాడు మేనేజర్.

''వంట వండుకోవాలి'' అనేసి నాలిక్కరుచుకున్నాడు సూర్యారావు.

ఆ మేనేజర్ తెల్లబోయి ''వ్వాట్'' అన్నాడు.

సూర్యారావు సిగ్గుపడుతూ ''నేను నా రూములోనే వంట పెట్టుకుని భోజనం చేస్తాను సార్. ఈ హోటలు తిండి నాకు పడటం లేదు సార్! అలా వంట చేసుకు తినమని మా అమ్మ లెటర్ కూడా రాసింది'' అన్నాడు సూర్యారావు.

సూర్యారావుతెగువకి మేనేజరు తెలుగులో నవ్వేసినా ఇంగ్లీష్‌లో లీవ్‌గ్రాంట్ చేశాడు.

''ఇక నళిని తనను చూసి నవ్వినా...భయపడకూడదు!''

తక్షణం ఒక జనతా స్టౌ కొన్నాడు. రెండు హిండాలియం గిన్నెలు, ఒక గరిటె కొన్నాడు.

## పూనమ్ షాపింగ్ స్ప్రీ

**అందాల తార పూనమ్ బజ్వాకి షాపింగ్ చేయడం అంటే తెగ ఇష్టంట. ఏ వూళ్లో వున్నా పెద్ద పెద్ద షాపింగ్ సెంటర్లకెళ్లి నచ్చినవన్నీ కొని పారేయడం ఆమె మహా ఇదట. అయితే ఈ సరదా తీర్చుకునేందుకు సినిమా తారగా మారకముందు పేరెంట్స్‌ని డబ్బుడగాల్సి వచ్చేదిట. అందువల్ల కొంచెం ఎంబరాసింగ్‌గా అనిపించేదిట. కానీ ఎప్పుడైనా సినిమా తారగా మారి మంచి ఆదాయం తన చేతికి వస్తోందో అప్పట్నించీ తన షాపింగ్ స్ప్రీని ఎంతో స్వేచ్ఛగా కొనసాగిస్తున్నాను అని గర్వంగా చెబుతోంది పూనమ్.**

సూర్యారావు తన ఆవకాయ, ఆవు నెయ్యి తినాలంటే స్వయంపాకం తప్పదు కాబట్టి...ఈ వస్తువులు వెంటనే కొన్నాడు. కానీ కిరసనాయిలు మర్చిపోయాడు. బీడీల అలవాటు లేక అగ్గిపెట్టె కొనుక్కోలేదు. ఒక స్టీలు గ్లాసూ, టిఫిన్ క్యారియర్‌లోని అయిదు గిన్నెలూ రూంలో ఉన్నాయి. ఫర్వాలేదని ఆలోచించాడే తప్ప మూకుడూ, దాంతో అట్లకాడా పొయ్యిలోకి ఇంధనం లేకుండా వంట ఎలా అనేది తెలుసుకోలేకపోయాడు సూర్యారావు తాత్కాలికంగా.

అంచేత ఆ రాత్రి మళ్ళీ సూర్యారావు హోటలుకే వెళ్ళవలసి వచ్చింది. వెళ్తుండగా నళిని కనిపించింది. పోనీ వీళ్ళను కాస్త కిరసనాయిలూ, అగ్గిపెట్టే అప్పు అడగనా? అనుకున్నాడు సూర్యారావు. కానీ చూస్తూ చూస్తూ రెండు జడలు వేసుకున్న ఆడపిల్లను ఎలా అడగటమా? అని సంకోచించాడు. కానీ సూర్యారావు గట్టివాడని మనకు తెలుసు. ముఖ్యంగా యిలాంటి విషయాల్లో హరిబ్రహ్మాదులు అడ్డు వచ్చినా అనుకున్న పని చేసి తీరుతాడు. కావున అడ్డంగా వచ్చిన నళినిని అడిగి తీరాలి అనుకున్నాడు. అది గమనించిన నళిని కూడా ''ఏం కావాలండీ'' అంది కమ్మగా.

''కిర్సనాయిలు'' అంటూ పెదాలు తడుపుకున్నాడు.

'ఎంత కలికాలమయినా, మగవాడికి కిరసనాయిలెందుకూ!' అందుకే నళినికి ఆశ్చర్యంతోపాటు కాస్త భయం కూడా వేసింది. కానీ తెలివైంది కనుక ''కరెంట్‌పోతే కొవ్వొత్తులున్నాయిగా ఇస్తాను'' అన్నది జాలిగా.

''కాదు! కరెంటు ఉంది! వండుకుందామని కిర్సనా...'' సూర్యారావుకి ఎవ్వరూ అడ్డులేరు. కానీ మాట పూర్తికాకముందు నళిని పారిపోయింది. భయమో, ప్రేమో, అనుమానమో, అదొక శృంగార చేష్టో విశేషమో లేక తెలుగు పాఠమో తెలియని సూర్యారావు కూడా నళిని పరుగు చూసి కంగారూ పడిపోయాడు.

నళిని వెళ్ళి వాళ్ళ బామ్మను పంపింది. కానీ అంతలో కంగారుపడిన సూర్యారావు హోటలు దాకా వెళ్ళిగానీ తిరిగి నళిని ఇంటి వైపు చూడనేలేదు.

వాళ్ళ బామ్మ నళినిని పిలిచి ''ఏమే! నువ్వు పెంకితనం చేస్తున్నావా? లేక ఆ కుర్రాడు వేషాలేస్తున్నాడా? చెప్పు! కిరసనాయిలెందుకు అతగాడికి. ఏడీ ఎక్కడున్నాడటా?'' అని గుద్దురిమింది.

నళిని నవ్వి అంతలో ఏడుపు మొహం పెట్టి ''నీ మీద ఒట్టు బామ్మా! ఆ అబ్బాయి వంట వండుకోడం కోసం కిర్సనాయిలే అడిగాడు'' అంది.

''వండుకుంటాడా? అయితే వడ్లు కావాలేమోనే పిచ్చి పిల్లా..పోన్లే రేపు యిద్దాం'' అంది ఉదారంగా బామ్మ.

అయితే పౌరుషంగల సూర్యారావుకి ఆ రేపు రోజున కిరసనాయిలు, వడ్లులాంటివి ఒకర్ని అడిగే అవసరమే లేదు. అన్నీ స్వయంగా తెచ్చు

కున్నాడు. తన గదిలోనే ఒక పక్క నీళ్ళుపోయే కాలువు దగ్గర స్టౌ పెట్టాడు. పప్పూ, ఉప్పూ అన్నీ చిన్న పోపుల పెట్టెలాంటి దాంట్లోనే అమర్చాడు. నళినింట్లో పనిచేసే గంగాయమ్మ జాలిపడి ''ఎందుకుబాబూ మీకీ శ్రమ! కావాలంటే క్రింద బామ్మగారు మడిగా వండిపెడతారు. తినరాదా? నేను చెప్పనా ఏంటి?'' అని అడిగింది. కానీ సూర్యారావు ''నాకు వంట వచ్చునుగా!! ఆవిడకెందుకూ శ్రమ?'' అని కూడా అన్నాడు.

''సరే మీ ఇష్టం'' అంది గంగాయమ్మ. 'పిచ్చిబాబు' అని తనలో తనే అనుకుంది.

క్యారియర్ గిన్నెలతోనే సిల్వర్ మూకుడుతోనూ మొత్తం మీద సూర్యారావు అన్నం, కూర చేసుకున్నాడు. బంగాళాదుంపలు తొక్క తీయకుండా బ్లేడుతో తరిగి ఆవునెయ్యితో వేపడం చేసుకున్నాడు.


మధ్య మధ్య కాస్త చెయ్యి కాల్చుకున్నాడు కానీ మరీ అంత ప్రమాదం లేదు! ఆవకాయలో అన్నం నంచుకుని కాస్త అన్నం ముద్దయింది..మరి కూరముక్కలకి ఉప్పు అద్దుకుని మొదట వేయడం మర్చిపోయాడు! మరి కొత్త కదూ! అలాగే..తిని వెంటనే పరిగెత్తి ఆఫీసుకి వెళ్ళిపోయాడు. అన్నం ముద్ద అయినా..కూరలో ఉప్పు మర్చిపోయినా..హోటల్ కూడుకంటే తన వంటే బ్రహ్మాండం అనిపించింది.

సూర్యారావు ఎంత పాకశాస్త్ర వీరుడో బొత్తిగా తెలియని మేనేజర్ అరగంట ఆలస్యమయిందని మెమో ఇచ్చాడు.

నళిని, సూర్యారావు వంట ఉద్యమం అంతా గంగాయమ్మ ద్వారా విన్నది. కుతూహలం, సంతోషం, జాలీ వంటివన్నీ ఆ పిల్ల మనసులో పెనవేశాయి. అద్దంలో చూసుకుంటూ కూడా రెండు జడలకు బదులు పరధ్యానంలో ఒక జడ వేసుకుని తిన్నగా బామ్మ కంటబడకుండా డాబా మీదకు వెళ్ళి సూర్యారావు గది కిటికీలో నుండి చూసింది.

''నిజంగా వండుకుంటున్నాడు. పైగా నీటుగా వండుకుంటున్నాడు కూడా'' అని ఆశ పడ్డది.

''ఛీ ఛీ నాకు బామ్మ అంటూన్నట్లు రెండు జడలు వేసుకోవడం తప్ప వంట కూడా రాదు'' అని బాధపడింది. పోనీ సుబ్బరంగా సూర్యారావులాంటి భర్త వస్తే హాయిగా, తీరిగ్గా రెండు జడలే వేసుకుంటూ ఉండవచ్చునని కూడా ధైర్యపడింది. నేరుగా క్రిందికి వెళ్ళి




''బామ్మా నువ్వు స్వార్థపరురాలివి'' అంది గట్టిగా.

''ఏం జరిగిందే లక్ష్మీదేవి?'' అన్నది వాళ్ళ బామ్మ మడిగా దూరంగా నుంచుని-

''మడీ మడీ అంటూ ఆఖరికి నాకు వంట కూడా నేర్పలేదు'' అంది నళిని కోపంగా.

''అదా నీ బెంగ? వంటదేం భాగ్యమే పిల్లా! రెండు జడలు నేను నేర్పేను గనుకనా, వంట నేర్పడానికి! అది మీ అత్తగారింట నేర్చుకుందువుగానిలే'' అని ధైర్యం చెప్పింది బామ్మ.

''ఊహూ నేను నేర్చుకోను'' అంది నళిని.

''సరే! మీ నాన్న ఓ వంటవాణ్ణి కాదు కాదు...వంట వచ్చిన మొగుణ్ణి చూసి తెస్తాడులే'' అంది బామ్మ బోలెడు నవ్వి. నళిని పారిపోయింది.

ఆ పారిపోవటంలో నళిని చాలా దూరదృష్టితో పారిపోయింది. ఆ వంటవాడూ, ఆ నలుడూ సూర్యారావే అయితే ఎంత బాగుండును. హాయిగా దమయంతిలా...వుండొచ్చు! కానీ సూర్యారావు పెళ్ళి చేసుకున్నాక వంట మానేస్తాడేమోనని భయం వేసింది అంతలోనే...

నళిని వెంటనే వాళ్ళమ్మ దగ్గరికి వెళ్ళి 'అమ్మా' అన్నది అత్యవసరంగా. వాళ్ళమ్మ వెంటనే ''పాపం మన ఇంట అద్దెకు దిగిన అబ్బాయి చెయ్యి కాల్చుకుంటున్నాడటగా'' అంది.

''ఔను! నన్నే అగ్గిపెట్టె అడిగాడు'' అంది నళిని.

''ఓసి నీ ఇల్లు బంగారంగానూ'' అంది వాళ్ళమ్మ అని మళ్ళీ కూతురు తల నిమిరి ''మనవాళ్ళ అబ్బాయేనట! పాపం బుద్ధిమంతుడు! కాకపోతే ఈ రోజుల్లో కూడా స్వయంపాకం చేసుకుంటాడా?'' అన్నది..లోలోపల ఏదో ఆశతో!

''పాపం వంట చేసేవాళ్ళు లేరు కాబోలే'' అంది నళిని.

''మీ నాన్నగారితో చెప్పనా?'' వాళ్ళమ్మ మాటలకు నళిని ఆశ్చర్యపోయి అంతలో తేరుకుని తుర్రుమని పారిపోయింది.

నేరుగా బామ్మ దగ్గరకెళ్ళి ''బామ్మా! నేను వంట నేర్చుకోను'' అని గట్టిగా అరిచి, గదిలోకి పారిపోయి మంచం మీదికి గెంతి 'కల నిజమాయెగా...' అంటూ కాళ్ళు ఎగరేస్తూ పాడుకుంది. అలాగే నిద్రపోయి కలలో ప్రేమలోపడి, సూర్యారావు వంట అతను తినిపించగా రుచి చూసింది కూడా!

కానీ ఏం చేస్తాం? కథల్లో విలన్లు ప్రవేశిస్తారుగా! నళిని కథ వంటతో ప్రారంభించి పెళ్ళితో ముగిస్తే రుచి బాగుండును. గానీ ''సూర్యారావులాంటి వంట వండుకుని తినేటంత చాదస్తం ఉన్న శుంఠకి ఆఖరికి హోటల్లోనైనా తిండి తినడం రాని చవట పిరికి పిసనారి సన్యాసికి పిల్లను యివ్వనుగాక యివ్వను'' అన్నాడు నళినీ వాళ్ళ నాన్నగారు.

''ఈ విలన్ లాంటి నాన్నలు ఉన్నంతకాలం ఆడపిల్లలు వంటలు, పిండివంటలు వచ్చినట్లు నేర్చుకోవలసిందే! ఛీఛీ..ఈ నాన్నలకు పిల్లల అభిరుచి అర్థం కాదు'' అంటూ తనలో తనే బాధపడిపోయింది నళిని. కానీ సూర్యారావు మీద ఆశపోలేదు. అదే ప్రేమ..అదే ఆశ...

ఇంచక్కా సూర్యారావును పెళ్ళి చేసుకొని..అతని చేతి వంట తింటూ..హాయిగా సిన్మాలు చూస్తూ..పాటలు పాడుకుంటూ...అప్పుడప్పుడు బామ్మ దగ్గరికి వచ్చి ఆమె చేతివంట తింటూ...గడిపేయాలని నళిని కలలు కంటూనే వుంది. అయితే - సూర్యారావు మనస్సులో ఏముందో తెలిసికోవడం ఎలా? ఒకవేళ తెగించి బామ్మతో చెప్పి సూర్యారావును తీసుకొని పారిపోదామంటే సూర్యారావు ఒప్పుకుంటాడా! ఏమో...

సూర్యారావు మాత్రం ఎంచక్కా వంట చేసుకొని కమ్మగా తింటూ...హాయిగా ఆఫీసుకు వెళ్ళుతూ..కాలం గడిపేస్తున్నాడు.

పారిపోదాం వస్తావా? అని అడగాలని రోజూ నళిని సూర్యారావుకు ఎదురు వస్తుంది!

ఆఫీసుకు వెళ్ళివస్తానంటూ తప్పించుకుపోతాడు సూర్యారావు.

తన ప్రేమగాథ విషాదగాథ కాకుండా రక్షించే దేవుడెవరా! అని అలా ఆలోచిస్తూ...ఎదురు చూస్తోంది నళిని.

☆